నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 5 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

అభిజిత్‌కు అండగా..

- 'నమస్తే' కథనానికి స్పందించిన దాతలు
- ఇప్పటి వరకు రూ. 1.12 లక్షల సాయం
- హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడుతానన్న కోరుట్ల ఎమ్మెల్యే

'నమస్తే'లో ప్రచురితమైన కథనం

దండేపల్లి, మార్చి4 : మండలంలోని లక్ష్మీకాంతాపూర్‌కు చెందిన ఈర్ల అభిజిత్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా, 'నమస్తే తెలంగాణ'.. 'అభిజిత్‌ను బతికించరూ..' పేరిట సోమవారం కథనం ప్రచురించింది. దీనిపై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌తో పాటు పలువురు దాతలు స్పందించారు. బీఆర్ఎస్ నాయకుడు వెంకటరమణ 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనాన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేయగా అభిజిత్‌కు అండగా ఉంటానని, హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్లతో మాట్లాడుతానని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రీట్వీట్ చేశారు. అలాగే దాతల నుంచి ఇప్పటి వరకు రూ.1,12,684 అందినట్లు అభిజిత్ తల్లిదండ్రులు తెలిపారు. ఇందుకు 'నమస్తే తెలంగాణ'కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వార్ధా వంతెన వెంటనే నిర్మించాలి

బీఆర్ఎస్ నాయకుల డిమాండ్.. ధర్నా

రోడ్డుపై బైఠాంచిన బీఆర్ఎస్ నాయకులు

కౌటాల, మార్చి 4 : కేసీఆర్ సర్కారు తెలంగాణ –మహారాష్ట్ర రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ వార్ధా నదిపై వంతెన నిర్మాణానికి రూ. 75 కోట్లు మంజూరు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు కౌటాల మండల కేంద్రం లోని ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. వెంటనే వంతెన నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మావల పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చేసి ఉంచిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సాధన కమిటీ చైర్మన్ సిర్ర దేవేందర్, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గొడం గణేశ్

అరెస్టులు అప్రజాస్వామికం

- అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం..
- వామపక్ష పార్టీల నాయకులు

ఎదులాపురం, మార్చి 4 : ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించిన సందర్భంగా నాయకులను అరెస్టు చేసి గొంతునొక్కే ప్రయత్నం చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. సీపీఎం పార్టీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పూసం సచిన్‌లతోపాటు సీసీఐ సాధన కమిటీ కో–కన్వీనర్ అరవింద్‌ను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అలాగే సీపీఐ ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సాధన కమిటీ చైర్మన్ సిర్ర దేవేందర్‌ను కూడా మావల పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య, రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు గొడం గణేశ్, వివిధ పార్టీల నాయకులను సోమవారం ఉదయం 3 గంటలకు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం..

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ పర్యటన సందర్భంగా అరెస్టుల పర్వానికి తెరలేపడం సరికాదన్నారు.

భయపడి అరెస్టు చేయడం సిగ్గుచేటు

ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నటు వంటి తుడుందెబ్బ సంఘం నాయకులను అరెస్టు చేయడం సిగ్గు చేటని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలు తుడుం దెబ్బ సంఘం నాయకులను అరెస్టు చేసి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. అనంతరం అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. మావల పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివాసీ సంఘం నాయకులు ధర్నా చేపట్టారు.

ఆశలపై నీళ్లు

ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై మాట్లాడని ప్రధాన మంత్రి మోదీ

- ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రస్తావించినా దక్కని ఫలితం
- మరోసారి జిల్లావాసులకు నిరాశే మిగిలింది..
- ఎన్నికల సభగానే జరిగిన మోదీ సభ

ఆదిలాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి విషయంలో తమ చిరకాల వాంఛ నేరవేరుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 40 సంవత్సరాల తర్వాత ప్రధాని హోదాలో మోదీ జిల్లా పర్యటనకు వస్తున్నందున పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని బీజేపీ ప్రజాప్రతినిధులు ఆశించారు. ప్రధాని కంటే ముందు ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల గురించి మాట్లాడారు. ఈ విషయంలో ప్రధాని సానుకూల ప్రకటన చేయాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యల గురించి చెబుతున్నప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. జిల్లా ప్రజాప్రతినిధులు స్వయంగా మోదీ సభలో ప్రస్తావిస్తున్నందున ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని జనం ఆశించారు. దాదాపు 25 నిమిషాలపాటు ప్రసంగించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తాము తెలియజేసిన అంశాలకు పరిష్కారం మార్గం చూపిస్తారని ఆశించినా చివరకు నిరాశే మిగిలింది.

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మాట్లాడుతున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

ఆదిలాబాద్ జిల్లా సమస్యలపై పట్టింపేదీ?

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు ఉన్నాయి. ప్రజలు కూడా వీటి పరిష్కారానికి చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు. ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలని, మూతపడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను పునః ప్రారంభించాలని, ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని, ఉట్నూర్‌లో గిరిజన యూనివర్శిటీని మంజూరు చేయాలని, జిల్లాలో పత్తిసాగు చేస్తున్న రైతుల ఉపాధిని మెరుగుపర్చడానికి టైక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, జిల్లావాసులు ఏళ్లుగా కోరుతున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్వయంగా మోదీ ముందు ఎంపీ బాపురావ్ మాట్లాడుతూ ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని,ఎయిర్‌పోర్టు విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా మాట్లాడుతూ.. ఆరు వేల మందికి ఉపాధి కల్పించే సిమెంట్ పరిశ్రమను ప్రారంభించాలని హామీ ఇవ్వాలని కోరారు. జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉన్నందున టైక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై మోదీ కనీసం స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. మోదీ సభ ఎన్నికల సభగానే కొనసాగిందే తప్పా.. ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ దందాలపై ప్రత్యేక నిఘా

- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం
- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాసులు
- జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌ల తనిఖీ

మంచిర్యాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

హాజీపూర్ : రికార్డులను పరిశీలిస్తూ..

దండేపల్లి, మార్చి 4 : అక్రమ దందాలపై ప్రత్యేక నిఘా పెట్టామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, పీడీ యాక్ట్ అమలు చేస్తామని రామగుండ పోలీసు కమిషనర్ ఎం. శ్రీనివాసులు హెచ్చరించారు. దండేపల్లి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఏఎస్ఐ పాల్ ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతగా జరిగేలా చూస్తాం

జన్నారం, మార్చి 4 : రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏసీపీ ప్రకాశ్, డీసీపీ అశోక్‌కుమార్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ సతీశ్ ఉన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

హాజీపూర్, మార్చి 4 : హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సీపీ శ్రీనివాసులు (ఐజీ), డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఎస్ఐలు చంద్రకుమార్, రామయ్య ఉన్నారు.

దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో..

మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపట్టి ఎఫ్ ఐఆర్ నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్ఐకి సూచించారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ ఉన్నారు.

పీడీయాక్ట్ నమోదు చేస్తాం

లక్షెట్టిపేట, మార్చి 4 : పట్టణ పోలీస్ స్టేషన్‌ను సోమవారం సీపీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమ దందాలు మానుకోవాలని, లేదంటే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసు బందోబస్తు మధ్య ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అశోక్‌కుమార్,

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన సీపీ

మంచిర్యాల అర్బన్, మార్చి 4 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షా కేంద్రాన్ని సోమవారం రామగుండం సీపీ శ్రీనివాసులు పరిశీలించారు. మంచిర్యాలలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ ఆర్ ప్రకాశ్, పట్టణ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఉన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

సీసీసీ నస్పూర్, మార్చి 4: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించిన అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్, సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ ఉన్నారు.

విజయ సంకేతం చూపిస్తున్న చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్, సభ్యులు

ఎన్నిక ఏకగ్రీవం

- కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా షాహిన్ సుల్తానా
- వైస్ చైర్మన్‌గా స్వామిశెట్టి రాజేందర్
- ఆర్డీవో సురేశ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం
- బీఆర్ఎస్ కౌన్సిలర్ల సంబురాలు
- అభినందనలు తెలిపిన కోనేరు కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 4 : కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లను బీఆర్ఎస్ పార్టీ కౌన్సిల్ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎన్నికల అధికారి, ఆర్డీవో సురేశ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జనవరి 20న చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్‌కుమార్‌లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో కొత్తగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. మొత్తంగా 30 మంది కౌన్సిలర్లు ఉండగా, ఇందులో 26 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా షాహిన్ సుల్తానా (19వ వార్డు), వైస్ చైర్మన్‌గా స్వామిశెట్టి రాజేందర్ (15వ వార్డు)లను ఏకగ్రీవంగా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి, ఆర్డీవో సురేశ్ సమక్షంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ముందు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ర్యాలీగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కోనేరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ వారిని అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు కోనేరు ఫణి ఉన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే
- బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్ దౌత్రే

ఆసిఫాబాద్, మార్చి4 : ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జిల్లాకు రాగానే మొదట కుమ్రంభీం, హైమన్‌డార్ఫ్ దంపతులకు నివాళులర్పించినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేశానని, మొదట ఐపీఎస్‌గా ఎంపికై అస్సాంలో మూడేళ్లపాటు విధులు నిర్వహించానని, ఆపై ఐఏఎస్‌గా ఎంపికై కామారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించానని చెప్పుకొచ్చారు. అనంతరం జీహెచ్ ఎంసీలోని ఖైరాతాబాద్ జోనల్ పరిధిలో అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఆపై జర్నలిస్టులు అడిగి ప్రశ్నలకు జవాబు ఇచ్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక నిఘా పెడుతామని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తామని చెప్పారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు కలిసికట్టుగా పనిచేస్తామన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్ దౌత్రేను ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దాసరి వేణు, దీపక్ తివారీ, డీపీఆర్వో సంపత్, డీఆర్వో లోకేశ్వర్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న మంచిర్యాల ఆర్డీవో కిషన్

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- మంచిర్యాల ఆర్డీవో కిషన్
- విద్యార్థులకు అవగాహన

లక్షెట్టిపేట, మార్చి 4 : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంలాంటిదని స్వీప్ నోడల్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో కిషన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 ఏండ్లు రాగానే ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట తహసీల్దార్ రాఘవేంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, ఎలక్టోరల్ ప్రచారకర్త సంధ్యారాణి, స్వీప్ నోడల్ కో–ఆర్డినేటర్లు రాంచందర్, కుమార్, ఏపీవో వెంకటరమణ, ఎంపీఎం లక్ష్మి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

రిమాండ్ సర్టిఫికెట్లతో ఉద్యమకారులు

దండేపల్లి, మార్చి 4 : తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మల విజయ్‌ధర్మ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కారులపై 2009లో అప్పటి ప్రభుత్వం పెట్టిన కేసులకు సంబంధించిన రిమాండ్ సర్టిఫికెట్‌ను లక్షెట్టిపేట సబ్‌జైలులో సోమవారం జైలర్ తేజావతి స్వామి చేతుల మీదుగా పలువురు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కంది సతీశ్‌కుమార్, కంది రవి, దాసరి రమేశ్, తదితరులున్నారు.

కుమ్రం భీం పోరాటం స్ఫూర్తిదాయకం

- నూతన కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే
- జోడేఘాట్‌లో భీం విగ్రహానికి నివాళి

కుమ్రం భీం సమాధి వద్ద పూలతో నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

కెరమెరి, మార్చి 4: కుమ్రం భీం పోరాటం స్ఫూర్తిదాయకమని నూతన కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే అన్నారు. సోమవారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి నేరుగా జోడేఘాట్‌ను సందర్శించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పక్కనే నిర్మించిన భీం స్మారక మ్యూజియాన్ని సందర్శించారు. ఆదివాసుల సంస్కృతి, ఆచార వ్యవహారాల గురించి అసిస్టెంట్ క్యూరేటర్ దుందేరావ్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం విరోచిత పోరాటం చేసి అమరుడైన భీం పేరిట ఏర్పాటు చేసిన జిల్లాల్లో పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని, ప్రతి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కలెక్టర్‌ను తహసీల్దార్ దత్తు ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, ఎంపీపీ పెందోర్ మోతీరాం, ఎంపీడీవో కృష్ణారావు, ఎస్ఐ విజయ్, ఎంపీవో అమ్జద్‌పాషా, నాయకులు పెందోర్ రాజేశ్వర్, జగన్నాథ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు అండర్–19 జిల్లా జట్టు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 4 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–19 జూనియర్ బాలుర జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 6న నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్యామ్‌సుందర్ రావు, కనపర్తి రమేశ్ సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ (గర్ల్స్)లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గిరిజన స్పోర్ట్స్ ఆఫీసర్ మీనా రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావుకు రిపోర్ట్ చేయాలని కోరారు. క్రీడాకారులు హెచ్ఎఫ్ఐ ఫారమ్‌లు 3 సెట్స్, ఆధార్ కార్డు, పదో తరగతి మెమో (ఒరిజినల్), రెండు పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలు, బోనఫైడ్ సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా తీసుకురావాలని, మరిన్ని వివరాలకు హ్యాండ్‌బాల్ కోచ్ చునార్కర్ అరవింద్(9550909870, 9866395859)ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 93.15 శాతం హాజరు

మంచిర్యాల అర్బన్, మార్చి 4 : జిల్లాలోని 25 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా సాగింది. సోమవారం 93.15 శాతం విద్యార్థులు పరీక్ష రాశారు. 7,415(జనరల్ 6,241, వొకేషనల్ 1,174) మంది విద్యార్థులకుగాను 6,907(జనరల్ 5,831, వొకేషనల్ 1,076) మంది పరీక్షలు రాయగా, 508 (జనరల్ 410, వొకేషనల్ 98) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఉచిత కోర్సులు ప్రారంభం

మందమర్రి రూరల్, మార్చి 4 : మందమర్రి ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం గ్యాస్ అండ్ వెల్డింగ్ కోర్సులను జీఎం మనోహర్ ప్రారంభించారు. సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సంస్థ ఉచిత కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నదని తెలిపారు. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, విద్యానంద్ ఐఎస్డీఎస్ జాయింట్ డైరెక్టర్ ఆర్డీ ఎస్డీఈ తెలంగాణ, పీకే చందల్ ప్రమోద్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ఎస్టీఐఆర్, నరసింహ ప్రసాద్, ట్రైనింగ్ ఆఫీసర్ సీ గోపీనాథ్, జీఎం వీటీసీ మేనేజర్ శంకర్, అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ అశోక్ పాల్గొన్నారు. అలాగే సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగం పొందిన 40 మందికి ఎమ్‌వీటీసీలో శిక్షణ తరగతులను జీఎం ప్రారంభించారు.